ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

గురువారం 17 అక్టోబరు 2024

సీతంపేట ఏరియా ఆసుపత్రిలో సదరం సేవలు

సీతంపేట రూరల్,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏరియా ఆసుపత్రిలో వచ్చే నెల నుంచి దివ్యాంగులకు సదరం సేవలు అందనున్నట్లు ఏరియా ఆసుపత్రి సూపరెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ..ఇకపై గిరిజనులు సదరం శిబిరాల కోసం పాలకొండ వరకు వెళ్లనవసరం లేదన్నారు. సీతంపేట ఏరియా ఆసుపత్రిలోనే సేవలు అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. అంతేగాకుండా ఆసుపత్రికి రెండు ఎక్స్‌రే యూనిట్లు కూడా మంజూరు చేసినట్లు వెల్లడించారు.ఆయన వెంట వైద్యాధికారులు రాజేష్, శ్రీనివాసరావులు ఉన్నారు.



రావివలసలో పార్వతీ పరమేశ్వరుల ప్రతిమలను ఊరేగిస్తున్న దృశ్యం

గౌరీ పౌర్ణమి వేడుకలు

గరుగుబిల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు గ్రామాల్లో గౌరీపౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి. పార్వతీపరమేశ్వరుల ప్రతిమలను ఊరేగించి భక్తుల దర్శనార్థం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అంతటా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రావివలస, శివ్వాం, గరుగుబిల్లి, గొట్టివలస, కొత్తూరు, రావుపల్లి, తదితర గ్రామాల్లోనూ గౌరీపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ నెల 19 వరకు పౌర్ణమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

భూ సమస్యల పరిష్కారానికే

గ్రామసభ: సబ్ కలెక్టర్

పార్వతీపురం రూరల్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. బుధవారం లక్ష్మీనారాయణపురంలో నిర్వహించిన గ్రామసభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా భూహక్కుదారుల పాస్‌పుస్తకాలు, రెవెన్యూ రికార్డులు, సవరణ ప్రక్రియను పరిశీలించారు. పాస్‌పుస్తకాల్లో తప్పుగా నమోదైన విస్తీర్ణ కొలతలు, పేర్లు, చిరునామాలను సరిచేయాలని సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్



కొనూపిరితో..

ట్రామా



- జిల్లాలో ట్రామాకేర్ సెంటర్లు ఏవీ
- ఆసుపత్రికి తరలించేలోపే మృత్యువాత పడుతున్న వాహనదారులు
- టీడీపీ హయాంలో కీలక ప్రతిపాదనలు
- ఐదేళ్లుగా పట్టించుకోని జగన్ సర్కారు
- నేడు వరల్డ్ ట్రామా డే

జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలు సంభవించేటప్పుడు ప్రాణాపాయాన్ని తప్పించేందుకు తక్షణ వైద్యం అందించే లక్ష్యంతో ట్రామాకేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన గతంలో టీడీపీ హయాంలోనే తెరపైకి వచ్చింది. వీటిని ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో మందికి సకాలంలో వైద్యం అందించి రక్షించుకోవచ్చు. భోగాపురం మండలం సుందరంపేట సీహెచ్‌సీని ట్రామాకేర్ సెంటర్‌గా మార్చాలని కూడా నిర్ణయించారు. ఆ వైపుగా అడుగులు పడుతున్న దశలో వైసీపీ ప్రభుత్వం వచ్చింది. ఆ సర్కారు కనీసం వీటి ప్రాధాన్యతను గుర్తించలేదు. దీంతో ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు అంశం పూర్తిగా మరుగున పడిపోయింది. కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ కదలిక రావొచ్చునని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు. నేడు వరల్డ్ ట్రామాడే పురస్కరించుకుని ప్రత్యేక కథనం.



6

పంచాయతీలకు మహర్దశ

- పల్లెలను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వ చర్యలు
- 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు
- మౌలిక వసతులకు పెద్దపీట
- జాబితా సిద్ధం చేసిన అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు

6



తోటపల్లిలో ముగిసిన

బ్రహ్మోత్సవాలు

గరుగుబిల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి దేవస్థానాల్లో ఈ నెల 12 నుంచి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బుధవారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు, విశేష హోమాలు చేశారు. భక్తులకు ప్రసాదాలు అందించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారికి ఇబ్బందులు కలగకుండా ఈవో వీవీ సూర్యనారాయణ, సిబ్బంది జి.శ్రీధర్ చర్యలు చేపట్టారు.



రెండేళ్లుగా

ఎదురుచూపు

- జిల్లాలో 950 మందికి అందని పశు నష్టపరిహారం
- గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం.. • ఇబ్బందుల్లో పాడి రైతులు
- నూతన ప్రభుత్వంపైనే ఆశలు



జియ్యమ్మవలస, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాడి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నేటికీ వారికి పశు నష్టపరిహారం అందలేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మొత్తంగా 950 మందికి రూ. 2.59 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. దీంతో పాడి రైతులంతా కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. వాస్తవంగా జిల్లా పరిధిలో పాడి రైతుల పశువులకు అప్పట్లో బీమా పథకం కింద పేర్లు నమోదు చేసుకున్నారు. దేశీయ పశువుల విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ రైతులైతే మూడేళ్లకు రూ.192, ఏపీఎల్ రైతులైతే రూ. 480 చెల్లించారు. ప్రమాదవశాత్తు లేదా పాడి పశువు సహజంగా చనిపోతే వారికి రూ.15 వేల వరకు చెల్లించాల్సి ఉంది. మేలు జాతి విదేశీ పశువు అయితే ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ వారు రూ. 384, ఏపీఎల్ రైతులు రూ. 960 మూడేళ్లకు చెల్లించారు. ఒకవేళ మేలు జాతి విదేశీ ఆవు చనిపోతే వారి ఖాతాకు రూ.30 వేలు జమవ్వాలి. గొర్రెలు, మేకలు విషయంలో ఏడాది , రెండేళ్లు, మూడేళ్లకు ప్రీమియం చెల్లించారు. సదరు బీమా చేసిన గొర్రెలు, మేకలు మరణిస్తే రూ. 6 వేలు లబ్ధిదారుని ఖాతాకు జమవ్వాలి.

ఇదీ పరిస్థితి...

జిల్లాలో పాడి రైతులకు 2022-23 నుంచి పశు నష్ట పరిహారం అందలేదు. మొత్తంగా 950 మంది పాడి రైతులు, గొర్రెలు, మేకలు పెంపకందారులకు చెందిన 1120 పశువులు, మేకలు, గొర్రెలు చనిపోయాయి. వీరికి రూ.2.59 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీనికి సంబంధించి 31 టోకెన్లు రూపంలో బిల్లులను గత ప్రభుత్వానికి నివేదించారు. ఇందులో 36 మంది మేకలు, గొర్రెలు పెంపకందారులకు చెందిన 206 పశువులు చనిపోయాయి. వారికి రూ.12,54,500 మేర పరిహారం చెల్లించాల్సి ఉంది. 914 మంది పాడి రైతులకు రూ. 2.46 కోట్లు చెల్లించాల్సి ఉంది. 2022-23లో వారికి నష్ట పరిహారం అందకపోవడంతో 2023-24లో మళ్లీ బిల్లులు పంపించారు. అయినా ప్రయోజనం లేకపో యింది. ప్రస్తుతం ఈ పరిహారమంతా సమగ్ర ఆర్థిక నిర్వ హణ వ్యవస్థ (సీఎఫ్ఎంఎస్) లో ఉన్నట్లు అధికారులు చెబు తున్నారు. అయితే తమకు నష్ట పరిహారం వస్తుందా? రాదా? అని పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు ప్రశ్ని స్తున్నారు. రెండేళ్ల నుంచి ఎదురుచూస్తున్నామని వారు వాపోతున్నారు.



ప్రభుత్వం దృష్టిలో ఉంది

జిల్లాలో 950 మంది పాడి రైతులు, గొర్రెలు, మేకలు పెంపకందారులకు చెందిన 1120 పశువులు, మేకలు, గొర్రెలు చనిపోయాయి. వీరికి రూ.2.59 కోట్ల మేర పరిహారంగా అందించాలి. ఈ విషయం ప్రభుత్వం దృష్టిలో ఉంది.

- మన్మథరావు, జాయింట్ డైరెక్టర్, పశు సంవర్థకశాఖ

చాలాచోట్ల తెరుచుకోలే..

- జిల్లాలో పూర్తిస్థాయిలో ప్రారంభం కాని ప్రైవేట్ మద్యం దుకాణాలు

సీతానగరం/సాలూరు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేట్ మద్యం దుకాణాలు చాలాచోట్ల తెరచుకోలేదు. నూతన మద్యం పాలసీలో భాగంగా 52 షాపులకు లైసెన్స్‌లు దక్కించుకున్న వారు బుధవారం కొత్త ప్రాంగణాల్లో వ్యాపారాలు మొదలుపెట్టాల్సి ఉంది. అయితే చాలాచోట్ల సరుకు రావడం జాప్యమవడం.. ఇతరత్రా కారణాలతో షాపులు తెరచుకోలేదు. తొలిరోజు సాలూరు , కురుపాం సర్కిళ్లలో ఒక్కొక్కటి చొప్పున, పార్వతీపురం సర్కిల్‌లో ఏడు షాపులు ప్రారంభించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. సాలూరు పట్టణంలో ఐదు, మండలంలో రెండు, మక్కువ, పాచిపెంట మండలాల్లో మూడు చొప్పున ప్రైవేట్ మద్యం షాపుల నిర్వహణకు ప్రైవేట్ వ్యక్తులకు అనుమతించారు. వారు వీటిని తెరవాల్సి ఉన్నప్పటికీ సరుకు రావడంలో జాప్యమైంది. అయితే బుధవారం రాత్రి ఎనిమిది గంటల వరకు ప్రైవేట్ మద్యం దుకాణాలు తెరుచుకోలేదు. దీంతో మందుబాబులు సాలూరులో బార్లను ఆశ్రయించాల్సి వచ్చింది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలపై లోపాలు గుర్తిస్తామని సాలూరు ఎక్సైజ్ సీఐ జి.దాసు చెప్పారు. మిగిలిన నిల్వలను స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు. ఈ లెక్కలను సరిచూస్తామని తేడాలుంటే సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సీతానగరం మండలం జోగింపేటలో మద్యం దుకాణాన్ని జేసీ శోభిక తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే మద్యాన్ని విక్రయించాలని ఆమె ఆదేశించారు.



సీతానగరం: జోగింపేటలో మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న జేసీ శోభిక

ఏజెన్సీలో గజరాజుల హల్‌చల్



కురుపాం/కురుపాం రూరల్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): కురుపాం మండలం గిరిశిఖర గ్రామాల్లో గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. సీతంపేట, భామిని మండలాల వైపు వెళ్లిన ఏనుగులు మళ్లీ ఈ ప్రాంతానికి రావడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మంగళ వారం రాత్రి తిత్తిరి పంచా యతీ పరిధి సీడిగూడ, పంజరమానుగూడల్లో నాలుగు ఏనుగులు సంచరించ రించాయి. పంట పొలాలు, జనావాసాల్లోకి అవి వస్తుండడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. సాయంత్రం వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లలేకపోతున్నారు. ప్రాణ, ఆస్తి నష్టం సంభవించక ముందే అటవీ శాఖాధికారులు స్పందించి వాటిని తరలించే చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.

స్థిర ఆదాయం వచ్చే యూనిట్లు స్థాపించాలి

- అధికారులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశం



పార్వతీపురం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): స్థిర ఆదాయం వచ్చే యూనిట్లను స్థాపించి ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. రానున్న 15 రోజుల్లో ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) కింద ప్రతి మండలంలో ఒక యూనిట్ ప్రారంభం కావాలన్నారు. స్థిర ఆదాయం వచ్చే వ్యాపారాలపై దృష్టిసారించాలని, యూనిట్ల స్థాపనకు అవసరమైన శిక్షణ ఇవ్వాలని వెల్లడించారు. జిల్లాలో వీడీవీకేలు బాగా పనిచేసేలా చూడాలన్నారు. పశు సంవర్థకశాఖ ద్వారా వచ్చే నెల 17 నాటికి 500 కుటుంబాల్లో గొర్రెల పెంపకం యూనిట్లు ప్రారంభించాలని ఆదేశించారు.

న్యూస్ బాక్స్



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిసిన మంత్రి సంధ్యారాణి, జిల్లా ఎమ్మెల్యేలు

‘మన్యం’లో సమస్యలు పరిష్కరించండి

- ముఖ్యమంత్రిని కోరిన మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు

పార్వతీపురం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, పార్వతీపురం, పాలకొండ, కురుపాం ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ , తోయక జగదీశ్వరి కోరారు. బుధవారం వారు సీఎంను కలిశారు. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏలకు పూర్తిస్థాయిలో పీవోలను నియమించాలని, కీలక పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కాగా గిరిజన ప్రాంతాల్లో డోలీలు మోతలు లేకుండా చేస్తామని, జిల్లా అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారాన్ని అందిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు మంత్రి సంధ్యారాణి ఫోన్ ద్వారా ‘ఆంధ్రజ్యోతి’కి తెలిపారు. గిరిజన యూనివర్సిటీ సాలూరు నియోజకవర్గ పరిధిలోనే ఉందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని సీఎం చెప్పినట్టు వెల్లడించారు. వరద బాధితుల సహాయార్థం సాలూరు పట్టణ వైద్యులు అందించిన రూ.లక్ష చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందించినట్టు మంత్రి తెలిపారు.

క్రైం కార్నర్

పరారై.. విగతజీవిగా మారి!

- పోక్సో కేసు నిందితుడి ఆత్మహత్య • మృతిపై పలు అనుమానాలు
- పోలీసులు నిర్లక్ష్యమే కారణమంటున్న కుటుంబ సభ్యులు



రాకేష్ (ఫైల్)

పార్వతీపురం రూరల్/ బెలగాం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లుగప్పి పరారైన పోక్సో కేసు నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బుధ వారం బెలగాం రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై శవమై కనిపించాడు. పార్వతీపురం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కర్రి రాకేష్ (20) అనే యువకుడిని సోమవారం రాత్రి రూరల్ పోలీసులు పోక్సో కేసు కింద అరెస్ట్ చేసి.. స్టేషన్‌కు తీసుకొచ్చారు. అయితే మంగళవారం నిందితుడు పరారైనట్లు పోలీసులు కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. కాగా బుధవారం తెల్లారేసరికి తమ బిడ్డ రైలు పట్టాలపై విగతజీవిగా పడి ఉన్నాడని, పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఇది జరిగిందని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తున్న వారు భారీగా పార్వతీపురం రూరల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పడంతో వారు వెనుదిరిగారు. దీనిపై ఎస్ఐ దినకర్.. మాట్లాడుతూ.. నిందితుడు ఇంటి నుంచి పరారై మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.



పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న మృతుని బంధువులు

కోమాలో ట్రామా

- జిల్లాలో ట్రామాకేర్ సెంటర్లు ఏవీ
- ఆసుపత్రికి తరలించేలోపే మృత్యువాత పడుతున్న వాహనదారులు
- నేడు వరల్డ్ ట్రామాడే

విజయనగరం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి)/ క్రైం/ రింగురోడ్డు: జిల్లాలో జాతీయ రహదారులపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ సమయంలో అత్యవసర అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే రహదారుల చెంతనే ట్రామాకేర్ సెంటర్లు లేక వెంటనే వైద్యం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. విజయనగరం, విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించేలోపు ప్రాణాలు వదులుతున్నారు. అయితే ట్రామాకేర్ సెంటర్ల పట్ల వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఒక కమిటీని కూడా ఏర్పాటుచేసింది. అధ్యయనం చేసి నివేదికలను సైతం అందించింది. అయితే రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి.

జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల మీదుగా 16వ నంబరు జాతీయ రహదారి 32 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అలాగే రాజాపులోవ నుంచి సాలూరు మీదుగా ఒడిశా రాయ్‌పూర్ 26 నంబరు జాతీయ రహదారి 90 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అంతర్ రాష్ట్ర రహదారులు సైతం ఉన్నాయి. ప్రతి 50 నుంచి 70 కిలోమీటర్ల మధ్య ట్రామా కేర్ తప్పనిసరిగా ఉండాలి. ఇది కేంద్ర ప్రభుత్వం విధించిన నిబంధన. కానీ జిల్లాలో ఒక్క ట్రామ్‌కేర్ సెంటర్ కూడా లేకపోవడం దయనీయం. దీంతో ఎంతోమంది రోడ్డు ప్రమాదాల బారిన పడినవారు సకాలంలో చికిత్స అందక మృత్యువాత పడుతున్నారు.

అయితే ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో కీలక అడుగులు పడ్డాయి. భోగాపురం మండలం సుందరంపేట సీహెచ్‌సీని ట్రామాకేర్ సెంటర్‌గా మార్చాలని నిర్ణయించారు. 26వ నంబరు జాతీయ రహదారికి సంబంధించి రామభద్రపురం, చీపురుపల్లి, విజయనగరం సర్వజన ఆస్పత్రి, సాలూరు, పార్వతీపురం ఆస్పత్రుల్లో ట్రామాకేర్ సెంటర్లు నెలకొల్పాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. అంతలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఈ అంశం మరుగునపడింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు సమీపంలోని సీహెచ్‌సీల వద్ద ప్రాథమిక వైద్యం అందిస్తున్నారు. ఆ తరువాత పెద్దాస్పత్రులకు తరలిస్తున్నారు.



ఏర్పాటు చేస్తే ఎంతోమేలు..

జిల్లాలోని జాతీయ రహదారుల్లో ప్రమాదాలు జరిగితే క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రథమ చికిత్స చేసి మెరుగైన తక్షణ వైద్యానికి ట్రామా కేంద్రానికి తరలిస్తారు. క్షతగాత్రులకు త్వరగా వైద్యం అందితే కోలుకునే పరిస్థితి ఉంటుంది. ఈ కేంద్రాల్లో ఇద్దరు చొప్పున జనరల్ సర్జన్‌లు, ఆర్థోపెడిక్ సర్జన్‌లు, మత్తువైద్యులు అందుబాటులో ఉంటారు. సహాయక సేవలు అందించేందుకు మూడు షిఫ్టుల్లో ఆరుగురు చొప్పున సిబ్బందిని నియమిస్తారు. అధునాతనమైన ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే అందుబాటులో ఉండాలి. ఇదంతా ఖర్చుతో కూడుకున్నది కావటంతో ప్రభుత్వాలు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రమాదాలు ఇలా..

16వ జాతీయ రహదారిపై 2024 సంవత్సరంలో 59ప్రమాదాలు జరగ్గా 23మంది మృతి చెందారు. 21మందికి తీవ్రగాయాలు.. 38 మందికి స్వల్పగాయాలు. 26వ జాతీయ రహదారిపై 2024 సంవత్సరంలో 84 ప్రమా దాలు జరగ్గా 43 మంది మృతిచెందారు. 35మందికి తీవ్రగాయాలు... 49 మందికి స్వల్పగాయాలు

భద్రతా ప్రమాణాలు పాటించాలి



జాతీయ రహదారుల వెంట ప్రయాణించే వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్‌లు ధరించాలి. ఇటీవల జరుగుతున్న ప్రమాదాల్లో హెల్మెట్ లేక చాలా మంది ప్రాణాపాయాన్ని తెచ్చుకున్నారు. జాతీయ రహదారులకు కనెక్టింగ్ రోడ్ల వద్ద స్పీడ్‌బ్రేకర్లు, డ్రమ్స్ బారికేడ్లు ఏర్పాటు చెయ్యాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. మలుపుల వద్ద బారికేడ్లు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. హెల్మెట్, షీట్‌బెల్టు ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్నాం. ట్రామాకేర్ ఏర్పాటుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

- వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం



రోడ్డుసేఫ్టీ దృష్టిలో పెట్టుకుని రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పిస్తాం. రోడ్డుభద్రత పాటించని వాహనాలపై కేసులు నమోదుచేస్తాం. అలాగే వాహనాల ఫిట్‌నెస్‌ను పరిశీలించి సరిగా లేకుంటే సీజ్‌చేస్తాం. సీట్‌బెల్టు, హెల్మెట్ వాడకంపై మొదట అవగాహన కల్పించి పాటించని వారిపై కేసులు నమోదు చేస్తాం.

- మణికుమార్, రవాణా శాఖ ఉప కమిషనర్



ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలి



సాధారణంగా రోడ్డుప్రమాదాల్లోనే ట్రామా కేసులు ఎక్కువ. తలకు గాయాలు, ఎముకలు విరగటం వంటివి జరుగుతాయి. కాబట్టి క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రులకు తరలిస్తే వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది. దీనిపై అందరికీ ప్రభుత్వం అవగాహన కల్పించాలి. ముఖ్యంగా గాయపడిన ప్రాంతాన్ని నొక్కటం, ఒత్తటం చేయకుండా ఐస్‌బ్యాగ్‌లు ఉంచటం ద్వారా వాపులనుంచి ఉపశమనం కలిగించవచ్చు. హైవే, టోల్ గేటు వద్ద ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి.

- డాక్టర్ భూపతి కీళ్ళ, ఎముకల వైద్య నిపుణులు

పంచాయతీలకు మహర్దశ

- పల్లెలను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వ చర్యలు
- 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు
- మౌలిక వసతులకు పెద్దపీట
- జాబితా సిద్ధం చేసిన అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు

పార్వతీపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీలకు మహర్దశ పట్టనుంది. కేంద్ర సర్కారు విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను పంచా యతీలకే కేటాయించి... వాటితో ప్రజలకు అవసరమైన పనులు చేపట్టాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. దీనిపై ఇప్పటికే అధికారులు ఆదేశాలివ్వగా.. అభివృ ద్ధి పనుల జాబితా కూడా సిద్ధమైంది. త్వరలో 451 పంచాయతీల్లో సుమారు రూ.27.43 కోట్ల తో 1532 పనులు చేపట్టేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. మొత్తంగా కూటమి సర్కారు చర్యలతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు అభివృద్ధి బాట పట్టనున్నాయని భావిస్తున్నారు.

జిల్లాకు నిధులు మంజూరు

జిల్లాలో పంచాయతీలకు ఆగస్టు నెలలో సుమారు 27.50 కోట్ల మేర 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. త్వరలో మరో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 27.50 కోట్ల వరకు మంజూరు కానున్నాయి. ఈ నిధులతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు, పారిశుధ్య మెరుగు చర్యలు చేపట్టనున్నారు. గ్రీన్ అంబాసిడర్‌లకు జీతాలు చెల్లించనున్నారు.

27.43 కోట్లతో 1,536 పనులు

జిల్లాలో 451 పంచాయతీల్లో 27.43 కోట్లతో 1536 అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఐదు రక్షిత నీటి పథకాల మరమ్మతులకు రూ. 85 లక్షలు, 304 పంచాయతీల్లో ప్రత్యేక రచ్చబండలు, ప్లాట్‌ఫార్మ్ నిర్మాణం కోసం రూ.3.56 కోట్లు, బోర్‌వెల్స్ నిర్మాణం, మరమ్మతులకు రూ.21 లక్షలు, 23 పంచాయతీల్లో ఆర్వో ప్లాంట్ల నిర్మాణానికి రూ. 57 లక్షలు, నాలుగు పంచాయతీల్లో కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.17 లక్షలు, మూడు పంచాయతీల్లో మహిళల కోసం మరుగుదొడ్ల నిర్మాణం, వాటి నిర్వహణకు రూ. 7లక్షలు, గ్రామాల్లో రహదారుల నిర్వహణ, మార్కెట్ షెడ్స్, బస్సు షెల్టర్ల నిర్మాణం తదితర వాటి కోసం.. ప్రణాళిక ప్రకారం నిధులు వెచ్చించనున్నారు.

ప్రణాళికలు రూపొందించాం

జిల్లాలోని 451 పంచాయతీల్లో సుమారు రూ.27.43 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాం. ఇప్పటికే పనుల జాబితాను తయారు చేశాం. ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నాం. గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించనున్నాం.

- రామచంద్రరావు, జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో..

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో పంచాయతీలు కనీస అభివృద్ధికి నోచుకోలేదు. అప్పట్లో 15వ ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించడంతో పల్లెల్లో కనీసం పారిశుధ్య పనులు కూడా చేపట్టలేని పరిస్థితి. పంచాయతీలకు మంజూరైన నిధులు కాగితాలకే పరిమితమయ్యాయి. గ్రీన్ అంబాసిడర్లకు కూడా సకాలంలో జీతాలు అందేవి కావు. వీధి దీపాలు, రోడ్ల పనులు సరేసరి. ఉపాధి మెటీరియల్ కాంపోనెంట్ నిధులను సైతం అప్పట్లో సచివాలయాలు, ఇతర భవన నిర్మాణాలకే కేటాయించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పైసా కూడా మంజూరు చేయలేదు. సర్పంచ్‌లు, ఇ తర ప్రజాప్రతినిధులు కూడా ఉత్సవ విగ్రహాల్లా మారారు. ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి. మొత్తంగా గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యమైపో యాయి. ఈ నేపథ్యంలో పంచాయతీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి సర్కారు చర్యలు తీసుకుంటోంది.



గౌరమ్మా.. దీవించమ్మా

- నేడు గౌరీ పౌర్ణమి.. గ్రామాల్లో కనిపించనున్న ఆధ్యాత్మికత శోభ
- ప్రారంభం కానున్న నందెన్న ఉత్సవాలు

విజయనగరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతాల్లో అత్యంత వైభవంగా జరుపుకునే వేడుక గౌరీపున్నమి (పౌర్ణమి). మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు. మంగళగౌరీవ్రతం చేస్తే ముత్తయిదవులకు మాంగళ్య బలం చేకూరుతుందని, పెళ్లికాని యువతకు వివాహాలు జరుగుతాయనే నమ్మకం ఉంది. ఎప్పటి నుంచో వస్తున్న ఈ సంప్రదాయాన్ని గ్రామీణ మహిళలు పాటలు, ఆటలతో జరుపుకుంటారు.

గౌరీ పున్నమి ఇలా..

మంగళగౌరీ వ్రతం చేసే మహిళలు ముందురోజు రాత్రి చేతినిండా గోరింటాకు పూసుకుంటారు. పున్నమి రోజును ఉదయాన్నే తలంటు స్నానాలు చేస్తారు. ఆరోంతా ఉపవాస దీక్షతో ఉంటారు. ఇళ్లు, వాకిళ్ల శుభ్రం చేసి ఆవుపేడతో ఇంటి బయట కల్లాపు చల్లి.. వరిపిండితో అందగా ముగ్గులు వేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు స్నానాలు చేసి.. పొలంలో ఉన్న వరిదుబ్బు (గౌరీదేవి ప్రతిరూపంగా)ను పళ్లెం వేసి తలపై ఇంటికి తీసుకువస్తారు. తెలంగాణలో బతుకమ్మ మాదిరిగా.. వరికును పసుపు, కుంకుమ, పూలతో అలంకరిస్తారు. ఇంటి బయట ముగ్గులతో రంగరించిన ప్రాంతంలో పీటమీద గౌరిదేవినీ ఉంచుతారు. చెరుకు, వడపప్పుతో పాటు పిండివంటలు నైవేద్యంగా పెట్టి మంగళ గౌరీ వ్రతం చేస్తారు.

ఆట పాటలతో పూజలు

పూజలు చేసిన తరువాత మహిళలు గౌదీదేవి చుట్టూ తిరుగుతూ ఆట పాటలతో కొలుస్తారు. జానపదాలు పాడుతూ మంగళహారతులను సమర్పిస్తారు. గౌరీదేవి పాటలు పాడుతూ శివపార్వతులను కీర్తిస్తారు. పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటారు. అలాగే రైతులు కూడా కొన్ని గ్రామాల్లో పున్నమి నాడు అమ్మవారి ఆలయాలు ముందు పత్రి కొమ్ములు వేసి మొక్కులు చెల్లించి వాటిని పొలాల్లో నాటుతారు.

నందెన్న సంబరాలు

జిల్లాలోని కొన్ని గ్రామాల్లో నందెన్న సంబరాలకు పున్నమి రోజున అంకర్పారణ చేస్తారు. ఈ రోజు మొదలు కార్తీక మాస శుద్ధ చవితి వరకు 21 రోజులు పాటు నిర్వహించడం తరతరాలుగా వస్తున్న ఆచారం. శివుని వాహనం అయిన నందిని మట్టితో తయారు చేసి.. వాటిపై శివపార్వతులు విగ్రహాలు ఏర్పాటు చేసి పున్నమి రోజున ఊరేగిస్తారు. ఆ సమయంలో.. మా ఇంటి ముందు దించండి అంటూ పోటీ పడి మంచాలను వేసి ఇళ్ల ముందు కొలుస్తారు. ఆ ఇంటి మహిళ కొంత దూరం వరకు నందెన్నను తలపై పెట్టుకుని అలా మరో ఇంటి మంచం వరకు ముందుకు సాగుతూ.. గ్రామం అంతా ఊరేగింపు నిర్వహిస్తారు.

శుభాలు కలగాలని పూజిస్తారు

సకల శుభాలు కలిగేలా, కలకాలం మాంగళ్యంతో ముత్తైయిదువుగా జీవించాలని మహిళా భక్తులు గౌరీదేవిని పూజిస్తారు. ఆశ్వీజమాసం, శుక్లపక్షం రోజున పౌర్ణమి గడియలు సంపూర్ణంగా వస్తాయి. దీంతో ఈ రోజునే గౌరీ పౌర్ణ మి అంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ రోజున అత్యంత భక్తి శ్రద్ధలతో ఉంటారు. యువతులు, మహిళలు గౌరీ వ్రతం చేస్తారు. ఇరుగు పొరుగు ముత్తైయిదువులను పిలుచుకుని వాయినాలు ఇచ్చుకుంటారు. ఉదయం, సాయంత్రం గౌరీదేవి మంత్రజపం చేస్తారు.

- కనకల మల్లీశ్వరీ, గంగచోళ్లపెంట

సకల గౌరమ్మలు ఆశీర్వదిస్తారు..

ఆశ్వీజమాసం, శుక్లపక్షం రోజున వచ్చే పౌర్ణమి రోజున గౌరీ వ్రతం ఆచరిస్తే సకల గౌరమ్మలు మహిళల కోర్కె లు తీరుస్తారు. ఉపవాసంతో అమ్మవారిని పూజిస్తే మాంగళ్యబలం చేకూరుతుంది. పసుపు కుంకుమలు కలకాలం నిలుస్తాయని పురాణాలు చెబుతున్నాయి. అదేవిధంగా పదిమందికి భోజనాలు, వాయినా లు ఇస్తే ఆ కుటుంబాన్ని గౌరీదేవి చల్లగా చూస్తుంది.

- నాగేంద్ర శర్మ, పెంటశ్రీరాంపురం



గ్రామాల్లో నందెన్న ఊరేగింపు చేస్తున్న దృశ్యం (ఫైల్)

నాడు-నేడు ఇక.. మనబడి-మన భవిష్యత్

- పేరుమార్చిన రాష్ట్ర ప్రభుత్వం

విజయనగరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించేందుకు గత ప్రభుత్వం ప్రారంభించిన మనబడి నాడు-నేడు పథకం పేరును కూటమి ప్రభుత్వం మార్పు చేసింది. మనబడి-మనభవిష్యత్‌గా మార్పు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బ్యాంకు ఖాతాల్లో కూడా మార్చాలంటూ పాఠశాల విద్యాకమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల యాజమాన్య కమిటీలకు ఇటీవల ఎన్నికల నిర్వహించి నూతన పాలకవర్గాలను ఎన్నుకున్నారు. మనబడి నాడు-నేడు జాయింట్ చెక్ హోల్డర్‌గా ఎస్‌ఎంసీ సభ్యులు ఉండేవారు. వీరి స్థానంలో కొత్తగా ఎన్నికైన వారు జాయింట్ చెక్ హోల్డర్‌గా బ్యాంకు ఖాతాల్లో పేర్లు మార్పు చేయాలని ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈమేరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. ప్రధానోపాధ్యాయులు బ్యాంకు ఖాతాల్లో ఈ మార్పులను వెంటనే చేయాలని పేర్కొన్నారు.

ఈ యువకుడు.. 'అగ్నివీర్'డు!



ఎంపికైన యువకుని అభినందిస్తున్న దృశ్యం

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలం ఎ.వెలగవలస గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి రాజశేఖర్ ఆర్మీ అగ్నివీర్‌లో రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. రాజశేఖర్ స్థానిక ట్రిపుల్ ఎస్‌డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం డిగ్రీ చదువుకుంటూనే ఆర్మీలో చేరాలన్న తపనతో సాధన చేయడం ప్రారంభించాడు. ఇటీవల అగ్నివీర్ జీడీ ఆర్మీలో ఉద్యోగం సాధించాడు. ఈ నెల 26న చెన్నైలో శిక్షణకు హాజరు కావాలని ఆర్మీ అధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. అలాగే పారా ట్రూపు స్పెషల్ ఫోర్స్‌లో ఉద్యోగం పొందాడు. ఈ ఉద్యోగానికి బెంగళూరు వె ళ్లవలసి ఉంటుంది. రైతు కుటుంబానికి చెందిన రాజశేఖర్ తండ్రి రాంబాబు, తల్లి రామలక్ష్మి తమ బిడ్డకు ఉద్యోగావకాశం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాజశేఖర్‌కు ఇద్దరు కవల అక్కలు ఉన్నారు. బొబ్బిలి పట్టణానికి చెందిన క్రీడా కోచ్ రావు శ్రీనివాసరావు గ్రామీణ ప్రాంతాల యువకులకు ఉచితంగా శారీరక వ్యాయామంలో శిక్షణ, మెలకువలను నేర్పుతున్నారు. ఆయన ఇచ్చిన శిక్షణ తనకు ఎంతగానో ఉపయోగపడిందని రాజశేఖర్ తెలిపారు.



పైడితల్లమ్మ దర్శనానికి క్యూలో భక్తులు



సిరిమానుకు పూజలు చేస్తున్న భక్తులు

పైడిమాంబకు ప్రత్యేక పూజలు



అమ్మవారి ఆలయం ముందు ఉంచిన సిరిమాను

విజయనగరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పైడితల్లమ్మ సిరిమానోత్సవం ముగిసినా ...అమ్మవారి దర్శనానికి వస్తున్న భక్తుల తాకిడి తగ్గడం లేదు. మంగళవారం అమ్మవారిని దర్శించుకోలేనివారు.. బుధవారం దర్శించుకున్నారు. పుష్పాలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించి తరించారు. ఆలయం వద్ద ఉంచిన సిరిమానుకు ప్రత్యేక పూజలు చేశారు. సిరిమాను చెక్కలు ఇంట్లో ఉంచుకుంటే శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో భారీ సంఖ్యలో వీటిని కొనుగోలు చేసుకుని ఇంటికి తీసుకెళ్లారు.



సిరిమాను చెక్కలు కొనుగోలు చేస్తున్న భక్తులు

కూటమి ప్రభుత్వంతోనే గ్రామ స్వరాజ్యం

శృంగవరపుకోట రూరల్/ కొత్తవలస /డెంకాడ /గుర్ల/ పూసపాటిరేగ /బాడంగి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో బుధవారం వీరు వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. గ్రామాల ప్రగతికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పల్లె పండుగతో గ్రామాల రూపరేఖలు మారుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎస్.కోట మండలంలోని రేవళ్లపాలెంతో పాటు కొత్తవలస మండలం నిమ్మలపాలెం, దేవాడ, గొల్లలపాలెం గ్రామాలలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పాల్గొన్నారు. బాడంగి మండలం గజరాయునివలసలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడులు పాల్గొన్నారు. డెంకాడ మండలం పెదతాడివాడ, పూసపాటి రేగ మండలం కుమిలిలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, కలెక్టర్ అంబేడ్కర్ పాల్గొన్నారు. గుర్ల మండలం ఎస్ఎస్ఆర్.పేట, దమరసింగిలో ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు పాల్గొన్నారు.



గుర్ల: రోడ్డు పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు



పూసపాటిరేగ : కుమిలిలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న లోకం మాధవి, కర్రోతు బంగార్రాజు



ఎస్.కోట రూరల్: రేవళ్లపాలెంలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



బాడంగి: అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు

రైలు ఢీకొని ఒకరి మృతి

సీతానగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీతానగరంలోని హడ్కో కాలనీ సమీపంలో సుమారు 60 ఏళ్ల వయసుగల గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి బుధవారం ఉదయం రైల్వే పట్టాలు దాటడానికి వస్తున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని రైలు ఢీకొనడం వల్ల గాని, రైలు వెళ్లే వేగానికి అదిరి కింద పడిపోయి తలకు గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. కేసు దర్యాప్తు నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు మృతుడు తెలుపు రంగు ఫుల్ కమీజు (లాల్చీ), బ్లూ రెడ్ చెక్స్ లుంగీ ధరించాడు. మృతుడికి సంబంధించిన ఆచూకీ తెలిస్తే విజయనగరం రైల్వే ఎస్ఐ వి.బలిజిరావు ఫోన్ నెంబరు 9490617089, లేదా బొబ్బిలి రైల్వే ఔట్‌పోస్టు ఇన్‌చార్జి బి.ఈశ్వరరావు ఫోన్ నెంబరు 9491813163 నెంబర్లకు తెలియజేయాలి.

కళ్లజోళ్లను బాగుచేయడానికి వెళ్లి..



యశోద (ఫైల్)

గరుగుబిల్లి/వీరఘట్టం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతోష పురం పంచాయతీ పిట్టలమెట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం పాలైంది. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు కథనం మేరకు.. బుధవారం వీరఘట్టం నుంచి వస్తున్న ఆటోను పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఆటోలో ఉన్న వీరఘట్టంలోని డౌన్ స్ట్రీట్ కాలనీకి చెందిన యండవ యశోదమ్మ (47) రహదారికి ఆనుకుని తుప్పల్లోకి తుళ్లిపడింది. దీంతో ప్రమాద స్థలంలో ఆమె మృతి చెందింది. కళ్లజోళ్లను బాగు చేయించుకోవడానికి పార్వతీపురం వెళ్తుండగా ఈఘటన జరిగింది. ఆటోలో ఉన్న మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు. ప్రమాద సంఘటనపై గరుగుబిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా యశోదమ్మ మృతితో రఘట్టంలోని డౌన్ స్ట్రీట్ కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆమె భర్త వెంకట్, కుమార్తె వెంకటలక్ష్మి ఉన్నారు. భర్త వెంకట్ కూలి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

తండ్రి పెద్దకర్మ రోజునే కుమారుడు మృతి



చంద్రశేఖర్‌నాయుడు(ఫైల్)

పాలకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తండ్రి దినకర్మ రోజునే కుమారుడు మృతి చెందిన సంఘటన పాలకొండలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పట్టణంలోని గాయత్రీనగర్‌లో నివాసముంటున్న విశ్రాంత ఎంఈవో పొదిలాపు రామినాయుడు ఇటీవల మృతిచెందిన విషయం విదితమే. కాలనీలో ఆయన పెద్దకర్మ బుధవారం నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఇంతలో రామినాయుడు చిన్న కుమారుడు చంద్రశేఖర్‌నాయుడుకు (బుజ్జి) మంగళవారం రాత్రి ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రిలో చేర్పించినా ఫలితం లేకపోయింది. ఆయనకు భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి దినకర్మరోజేనే కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. కాలనీతో పాటు పాలకొండలో విషాదఛాయలు అలముకున్నాయి.

కోనేటిలో కాలుజారి పడి..

బాడంగి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ వీధికి చెందిన కండి రమేష్ (52) ప్రమాదవశాత్తూ స్థానిక మంచినీటి కోనేరులో కాలుజారి పడిపోవడంతో మృతిచెందాడు. ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు... రమేష్ బుధవారం మధ్యాహ్నం తన తోడల్లుడు బోనెల రవికుమార్‌తో కలసి బహిర్భూమికి వెళ్లాడు. కాలు కడుగుకునేందుకు కోనేరులో దిగి... ఈత రాని కారణంగా మునిగిపోయాడు. రవికుమార్‌కు కూడా ఈత రాకపోవడంతో పరుగు పరుగున గ్రామంలోకి వెళ్లి స్థానికులకు ఈ విషయాన్ని చెప్పాడు. వారు వచ్చి గాలించినా ప్రయోజనం లేకపోయింది. స్థానిక సర్పంచ్ పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది రమేష్ మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడు, అతని భార్య లక్ష్మి జామకాయల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. వీరికి పిల్లలు లేరు. స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బస్సు ఎక్కబోతూ... జారిపడిన వ్యక్తికి గాయాలు

పాలకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో ఆర్టీసీ బస్సు ఎక్కే ప్రయత్నంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. స్థానిక వెంకటరమణ కాలనీకి చెందిన శివాజీ మాస్టార్ తన పిల్లలను విశాఖ పంపించేందుకు బుధవారం బయలుదేరాడు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఔట్ గేటు వద్ద శ్రీకాకుళం బస్సు వెళ్తుండగా ఆపాడు. తన లగేజీ బ్యాగ్‌ను బస్సులో ఉంచి రెండో బ్యాగ్‌ను పట్టుకొని ఎక్కే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో బస్సు ముందుకు కదలడంతో శివాజీ కింద పడ్డాడు. బస్సు కింద కాలు ఉండిపోవడంతో తీ వ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయన్ను 108లో పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం రిఫర్ చేశారు.

అభివృద్ధిపై మాట్లాడే హక్కు లేదు: కళా

వంగర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధిపై కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు, ఆ పార్టీ నాయకులకు లేదని ఎమ్మెల్యే కళా వెంకటరావు మండిపడ్డారు. బుధవారం మాజీ జెడ్పీటీసీ వాసుదేవరావు స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలు కాకముందే పిచ్చితో ప్రభుత్వాన్ని విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. మద్యం విధానంపై విమర్శలు చేస్తున్న జగన్, కూటమి అవలంబించిన తీరును తెలుసుకోవాలన్నారు. 500 దకాణాలకు దరఖాస్తులు పెట్టుకున్న వారికి ఒక్క షాపు కూడా దక్కలేదంటే లాటరీ ఎంత పారదర్శకంగా జరిగిందో తెలుసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామాల అభివృద్ధికి రూ.1600 కోట్లు నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పైల వెంకటరమణ, సాయిరాం, తదితరులు ఉన్నారు.

బొత్స కుటుంబానికి కళా పరామర్శ

ఇటీవల మరణించిన వంగర మాజీ సర్పంచ్ రామారావునాయుడు కుటుంబాన్ని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు బుధవారం పరామర్శించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. మృతుని సోదరుడు, మాజీ జెడ్పీటీసీ వాసుదేవరావు నాయుడును కలిసి ఓదార్చారు ఆయనతో పాటు టీడీపీ నాయకులు మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

భవిష్యత్తులో రోడ్ల సమస్యలు రానివ్వం

రాజాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భవిష్యత్‌లో రోడ్ల సమస్య లేకుండా కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు చూసుకుంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రోడ్ల దుస్థితి ఎలా ఉందో అందరికీ తెలుసని విమర్శించారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రూ.4500 కోట్లతో వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, ఎనిమిది లక్షల కుటుంబాలకు వంద రోజులు పని కల్పిస్తున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీలకు పండగ వచ్చిందన్నారు.

జాబ్ పేరిట కాల్స్‌పై అప్రమత్తం:ఎస్పీ

విజయనగరం క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ జాబ్‌పేరిట వచ్చే కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. సైబర్ మోసగాళ్లు రోజురోజుకి కొత్త మోసాలకు పాల్పడుతున్నారని, వారి పట్ల అప్రమత్తం గా ఉండాలని తెలిపారు. లేకుంటే భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుందన్నారు. వారి ఉచ్చులో పడిన కొంతమంది తెలియక మోసపోతుంటే..మరి కొందరు అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఇటీవల కొంతమంది ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్ జాబ్స్ సెర్చ్‌చేసి మోసపోయిన సంఘటనలు వెలుగు చూస్తున్నాయన్నారు. వీటి విషయంలోనూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గురుకుల పాఠశాల పరిశీలన

వేపాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బక్కునాయుడుపేట వద్ద గల అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం జిల్లా కోఆర్డినేటర్ టీఎం ఫ్లోరెన్స్ ఆకస్మికంగా పరిశీలించారు. ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేసారు. అనంతరం వసతి గృహంలో గల వంట దినుసులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట

విజయనగరం టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిభివృద్ధికి ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి అన్నారు. బాలాజీ కూడలి, మాన్సాస్ మైదానంలో ఈ నెల 11న ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజార్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బజారు ద్వారా ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడమే కాకుండా, ప్రజలకు అవగాహన కల్పించే అవకాశం కలుగుతుందన్నారు. డ్వాక్రా బజారు ప్రారంభం నుంచి బుధవారం వరకు రూ. 5.19 కోట్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ వసతి గృహాల తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ పట్టణంలోని ప్రభుత్వ వసతిగృహాలను బుధవారం తనిఖీ చేశారు. వసతి గృహాలలో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. వంట గదులు, స్టోర్‌రూంలు, బాత్రూంలు, డైనింగ్ హాల్స్‌ను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, ఆహార నాణ్యతతో పాటు సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వారి నుంచి సైతం సమాచారాన్ని రాబట్టారు. ప్రభుత్వపరంగా అందుతున్న పథకాల వివరాలను విద్యార్థుల నుంచి సేకరించారు. సీనియర్ న్యాయాధికారి వెంట రాజాం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జయదేవ్, కార్యదర్శి ఈశ్వరరావు, ప్రభుత్వ న్యాయవాది శెట్టి పోలారావు ఉన్నారు.

సీబీఎం వ్యవహారంపై దర్యాప్తు అవసరం

బొబ్బిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో గల సీబీఎం బాలికల ఉన్నత పాఠశాల వ్యవహారంపై నిష్పాక్షికంగా దర్యాప్తు నిర్వహించి నిజాలను నిగ్గు తేల్చాలని ఎమ్మెల్యే బేబీనాయన డిమాండ్ చేశారు. స్థానిక దర్బారు మహల్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీబీఎం ట్రస్టుకు సంబంధించిన సుమారు ఐదువేల చదరపు గజాల స్థలం కనీసం రూ.50 కోట్ల విలువ చేస్తుందన్నారు. ఇంత ఖరీదైన ఆస్తిని కోమటిపల్లిలో రూ.5 కోట్ల ఆస్తి కోసం ఒప్పందం కుదుర్చుకొని భూ బదలాయింపు జరుపుకున్నారన్నారు. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. పారదర్శకంగా ఈ లావాదేవీలు జరిగి ఉంటే చీపురుపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అత్యంత గోప్యంగా ఎందుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ వ్యవహారం వెనుక అప్పటి ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నదీ లేనిదీ తేలాల్సి ఉందన్నారు. కళ్ల ముందు ఇంత అన్యాయం జరుగుతున్నా.. స్పందించకపోతే తాను కూడా నేరస్తుడినవుతానని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ప్రజాసంఘాలు, ఇతర ప్రతినిధులు చేస్తున్న పోరాటాన్ని అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనిపై ఉన్నత స్థాయి దర్యాప్తు చేసి.. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నట్లు బేబీనాయన తెలిపారు.

వాలీబాల్ జట్ల ఎంపికకు పోటీలు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని ఏపీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో బుధవారం అండర్ 17 బాలురు, బాలికల వాలీబాల్ జట్ల ఎంపిక పీడీ నల్ల వెంకటనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. నాలుగు మండలాల నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో 12 మంది బాలురు, 12 మంది బాలికలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపిక కమిటీలో శివున్నాయుడు, ఏబీసీ నాయుడు, మురళీ కృష్ణమూర్తి, వెంకటరావు పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ ఎంపికలు

విజయనగరం టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 2024- 2025 సంవత్సరానికి సంబంధించి స్కూల్ గేమ్స్ ఎంపికలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణంరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 14, అండర్- 17 విభాగాల్లో ఈ నెల 17 నుంచి 23 వరకు ఎంపికలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.



బొబ్బిలి రూరల్: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారిణులు

పైడిమాంబ ఆశీస్సులు ఉండాలి

దాసన్నపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత పైడిమాంబ ఆశీస్సులు ప్రజలందరిపై మెండుగా ఉండాలని శ్రీవిద్యా పీఠం వ్యవస్థాపకులు యనమండ్ర వేణుగోపాల శాస్త్రి ఆకాంక్షించారు. బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి పైడిమాంబను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

ఇసుక రీచ్ ప్రారంభం

తెర్లాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కుసుమూరులో బుధవారం ప్రభుత్వం ఉచిత ఇసుకరీచ్‌ను మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్.వెంకటనాయుడు, ఎస్.వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు తావు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మైన్స్ డీడీ నరసింహారెడ్డి, ఉప తహసీల్దార్ సత్యనారాయణ, మండల వీఆర్వోల సంఘ అధ్యక్షుడు నరసింహ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమీక్ష

బాడంగి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను నిర్వహణలోకి తీరుకురావాలన్నారు. అసంపూర్తిగా ఉన్న షెడ్లను పూర్తి చేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్ల పనితీరు మెరుగుపరచాలన్నారు. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేస్తూ తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ, కార్యదర్శులు పాల్గొన్నారు

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

విజయనగరం రింగ్‌రోడ్డు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ వైద్య సేవల సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఎన్‌టీఆర్ వైద్య సేవ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు జెర్రిపోతుల ప్రదీప్ కోరారు. వైద్య సేవల సిబ్బంది న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి పలుమార్లు ప్రజా ప్రతినిధులను కలిసినా పరిష్కారం కాలేదన్నారు. 17 ఏళ్లుగా క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్న సిబ్బంది జీవితాల్లో మార్పు రాలేదని, ఈ నెల 29 నుంచి సమ్మెలో దిగనున్నామని ఆయన తెలిపారు.

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

రామభద్రపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే హెరిటేజ్ సంస్థ ధ్యేయమని మేనేజర్ ఇసన్యాసినాయుడు తెలిపారు. ఆరికతోట గ్రామంలో బుధవారం హెరిటేజ్ సెంటర్‌ను కొత్తగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ సూపర్‌వైజర్ బి.రామారావు, సెంటర్ ప్రతినిధి, వర్రి రామ్మూర్తి, రైతులు బేత పైడితల్లి, కిర్ల అప్పారావునాయుడు, నూకంనాయుడు, వర్రి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

రామభద్రపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రమాదాలు నిరోధించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే ప్రమాదాలు ఎక్కువగా జరిగే స్పాట్‌లను గుర్తించామని తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు డయల్ యువర్ డీఎం

శృంగవరపుకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ఆర్టీసీ డీఎం రమేష్ గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రయాణికులు డిపో మేనేజర్ 9959225619, సూపరింటెండెంట్ 7382923679 నెంబర్లకు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు, సలహాలను అందించవచ్చునని తెలిపారు.

క్రమశిక్షణ అవసరం

రేగిడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు నడవాలని సెట్‌శ్రీ ఇన్‌చార్జ్ సీఈఓ కేవీ రమణ పేర్కొన్నారు. ఉంగరాడ గురుకుల కళాశాల, సంకిలి హైస్కూల్‌లో బుధవారం వ్యక్తిత్వ వికాసం, కెరీర్‌గైడెన్స్, మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ క్రైమ్‌లపై విద్యార్థులకు చైతన్య సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో హెచ్ఎం రామినాయుడు, ప్రిన్స్‌పాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుడి.. బడికి దూరంగా ఉండాలి

రాజాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపులను యాజమానులు గుడి... బడి... ఆసుపత్రులకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని రాజాం ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ అన్నారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రాజాం నియోజకవర్గ పరిధిలో 17 మద్యం షాపులు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం షాపుల ఏర్పాటుకు తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విమానాశ్రయం పనులు 45 శాతం పూర్తి: ఎంపీ



జీఎంఆర్ ప్రతినిధులతో మాట్లాడుతున్న భరత్

డెంకాడ(భోగాపురం),అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విమానాశ్రయ పనుల్లో 45 శాతం పూర్తయ్యాయని విశాఖ ఎంపీ భరత్ తెలిపారు. 27 శాతం టార్గెట్ అధిగమించి నిర్మాణం వేగంగా కొనసాగుతోందని, ఈ డిసెంబరు నుంచి ఏటీసీ టవర్ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుందని చెప్పారు. భోగాపురం మండలంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం పనులకు సంబంధించి జీఎంఆర్ నిర్మాణ సంస్థ అధికారులతో భరత్, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, విశాఖ పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ చర్చించారు రాబోయే 50 సంవత్సరాల వరకు ఎటువంటి అవాంతరాలు లేకుండా నిరంతరం రన్ అయ్యేలా, తీరప్రాంత పరిస్థితులకు తగ్గట్టుగా మెటీరియల్, మెయింటెనెన్స్ పకడ్బందీగా ఉండాలని ఎంపీ సూచించారు. విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయానికి రాకపోకలు సులభతరం చేసే మార్గాల అభివృద్ధి పనులపై కూడా చర్చించారు.



మద్యం దుకాణం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు, యువకులు

మద్యం దుకాణం మార్చాలి

డెంకాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పెదతాడివాడ పంచాయతీ పరిధిలోని గల మద్యం దుకాణంమరో ప్రాంతానికి మార్చాలని మాజీ సర్పంచ్ పడాల చిన్నారావు, జనసేన నాయ కురాలు తుమ్మి లక్ష్మీరాజ్ ఆధ్వర్యంలో మహిళలు, యువకులు కోరారు. ఈమేరకు మద్యం నిర్వహిస్తున్న ప్రదేశంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మద్యం దుకాణం నిర్వహిస్తున్న చుట్టుపక్కల నివాస గృహాలు ఉండడంతో మహిళలకు, పిల్లలకు ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు. కాగా మద్యం దుకాణం వ్లల మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదులు రావడంతో 15 రోజుల్లో వేరే ప్రాంతానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎక్సైజ్ శాఖ సీఐ విజయలక్ష్మి తెలిపారు.

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: డీఎంహెచ్‌వో



రావివలస పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న విజయపార్వతి

గరుగుబిల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.విజయ పార్వతి సూచించారు. బుధవారం మండలంలోని రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యం, సురక్షిత ప్రసవమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రసవాల సంఖ్య పెంచాలని ఆదేశించారు. అనంతరం వ్యాక్సిన్ నిల్వలతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. కార్య క్రమంలో వైద్యాధికారులు కీర్తి, డాక్టర్ యోగేశ్వరరావు, ఈవో జగన్నాథరావు, సిబ్బంది జి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జగన్మోహనరావు

జియ్యమ్మవలస, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి ప్రసవాలు పెరగాలని,మారుమూల గ్రామాల ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ టి.జగన్మోహనరావు వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం గవరమ్మపేట, ఎం.అల్లువాడల్లో వ్యాక్సినేషన్ పరిశీలించారు. అనంతరం జియ్యమ్మవలస పీహెచ్‌సీలో వైద్యాధికారులు సాయిప్రసన్న, పూలబంతి జగదీష్, వైద్య సిబ్బందితో సమీక్షించారు.

భూపాలపురంలో మినీ పోస్టాఫీసు ప్రారంభం

గుర్ల, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపాలపురంలో మినీ పోస్టాఫీసును టీడీపీ ప్రచార కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు బుధ వారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కిరణ్‌కుమార్, జెడ్పీటీసీ అప్పలనాయుడు, టీడీపీ నాయకులు చీర సత్యం, రామ్మూర్తి, జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు. కాగా ప్రోటోకాల్ పాటించకుండా టీడీపీ నాయకులు పోస్టల్ కార్యాలయం ఎలా ప్రారంభిస్తారని జడ్పీటీసీ సభ్యుడు అప్పలనాయుడు, సర్పంచ్ విజయలక్ష్మి ప్రశ్నించారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరగడంతో ఎస్ఐ నారాయ ణరావు జోక్యం చేసుకొని వారిని బయటకు పంపించారు.

శివారు భూములకు నీరందించాలి



తోటపల్లి ప్రధాన కాలువ వద్దకు వెళ్తున్న రైతులు

పాలకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రధాన కాలువల ద్వారా శివారు ఆయకట్టుకు నీరందించాలని పీఆర్‌రాజుపేట రైతులు డిమాండ్ చేశారు. వర్షాలు కురవకపోవడంతో వరి పంటకు నీరందక ఎండిపోతోం దని వాపోతున్నారు. ఈ మేరకు బుధవారం సాగునీటి కోసం తోటపల్లి ప్రధాన కాలువ 8వ బ్రాంచ్ వద్ద అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడానికి వెళ్లారు. నీరందకపోతే లక్షలాది రూపాయలు నష్టపోతామని రైతులు వాపోతున్నారు.తక్షణమే పంటలను రక్షించడానికి నీటిపారుదలశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

మత్తు పదార్థాలకు తరిమికొడదాం

భామిని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు తరిమికొట్టి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని భామిని జిల్లా పరిషత్‌పాఠశాల హెచ్‌ఎం వెంకటరావు పిలుపునిచ్చారు. బుధవారం భామినిలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, ఆరోగ్యంగా ఉండాలని నినాదాలు చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

డయేరియాపై ఆందోళన చెందవద్దు

● సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశం ● గుర్లలోని డయేరియా సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్ అంబేడ్కర్

గుర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డయేరియాపై ప్రజలు ఆందోళన చెందవద్దని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోరారు. బుధవారం గుర్లలోని డయేరియా సెంటర్‌ను పరిశీలించి రోగుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డయేరియా సెంటర్‌కు వచ్చిన వారిని ఇంటికి పంపించకుండా ఇక్కడే వైద్యం చేయాలని తెలిపారు. తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.డయేరియా ప్రబలడానికి, ఒకేరోజు నలుగురు మృతిచెందడంపై కూడా వివరాలు తీసుకోవాలన్నారు. తక్షణమే ఈవిషయంపై నివేదిక తయారు చేయాలని కోరారు. సెంటర్‌లో కొంతమంది రోగులు బయట ఆహారం తిన్నట్లు చెప్పినట్లు తెలిపారు.అపోహలు సృష్టించకుండా, వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తగా వైద్యం చేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కూడా డయేరియాపై సమగ్ర నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. అత్యవసరమైతే వెంటనే వారిని విజయనగరంలో ఒకవార్డు ఏర్పాటుచేసి అక్కడ వైద్యమందించాలని కోరారు. మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖ కూడా తరలించాలని తెలిపారు. అధికారులు నిర్లక్ష్యంవహిస్తే ఊరుకునేది లేదన్నారు. గ్రామంలో పారిశుధ్యం, మంచినీటిపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. అనవసర వదంతులు వ్యాపింపజేస్తున్నవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా డయేరియా బాధితులను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పరా మర్శించారు. ఈసంఘటనపై సమగ్ర విచారణ జరిపించాని కోరారు. ఆయన వెంట వైసీపీ నాయకులు కేవీ సూర్యనారాయణరాజు, సన్యాసినాయుడు, జడ్పీటీసీ అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

20 పడకలతో ప్రత్యేక వార్డు సిద్ధం చేయండి

చీపురుపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గుర్ల డయేరియా బాధితుల కోసం చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డు సిద్ధం చేయాలని ఆసుపత్రి సర్వీసుల జిల్లా సమన్వయకర్త(డీసీహెచ్ఎస్) భాగ్యలక్ష్మి ఆదేశించారు. బుధవారం చీపురుపల్లిలో చికిత్సలు పొందుతున్న డయేరియా రోగులను పరామర్శించారు. అనంతరం ఇక్కడ సూపరింటెండెంట్, సిబ్బం దితో మాట్లాడారు. గుర్ల నుంచి తరలించిన డయేరియా రోగులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు.

ఆ నీరు కలుషితం కాలేదు

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) చంపావతి నీటి ప్రవాహంలో ఎగువ ప్రాంతం నుంచి జంతు కళేబరాలు కొట్టుకురావడం వల్ల నీరు కలుషితమై గుర్లలో అతిసారం ప్రబలింది అనే వార్త అపోహ మాత్రమేనని కలెక్టరు అంబేడ్కర్ స్పష్టం చేశారు. అక్కడి నీటికి పరీక్షలు జరపగా నెగటివ్ వచ్చిందని, ఆ నీరు కలుషితం కాలేదని తెలిపారు.

ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలి

●ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్



డిపో ఎదుట నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

పాలకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు బుధవారం హాజరయ్యారు. డిపో ఎదుట మధ్యాహ్న విరామం సమయంలో గేటు మీటింగ్ ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా జోన్ కార్యదర్శి బీకేమూర్తి మాట్లాడుతూ సమస్యలపై యాజమాన్యం సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు బీవీ రమణ, డీజే బాబు, వై.రామకృష్ణ, సతీష్‌కుమార్, కేవీ రమణ, బి.రాజేంద్రకుమార్, బీఎస్ దొర, బి.కళావతి, బి.ఎస్.కుమారి, కె.నాగమణి, ఎస్.లక్ష్మీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ కలిశెట్టి



సమావేశంలో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి

విజయనగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బుధవారం జరిగిన మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్, కమ్యూనికేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఎగ్జామినేషన్ ఆఫ్ డిమాండ్ ఫర్ గ్రాండ్స్ 2024-25 సమావేశంలో ఆయన సూచనలు, సలహాలు అందజేశారు.

సాలూరులో దుర్గాదేవి విగ్రహం నిమజ్జనం

సాలూరు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సాలూరులోని కామాక్షి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకని కొలువుదీరిన దుర్గాదేవిఅమ్మవారిని బుధవారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమను తిరువీధి నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక గురువు ముద్దు సత్యనారాయణ పర్యవేక్షణ మధ్య వేదమంత్రోచ్చారణ మధ్య అమ్మవారి ప్రతిమను నిమజ్జనంచేశారు. కార్యక్రమంలో అర్చకుడు సూరిబాబు,ఆలయ బృందం అప్పలరాజు, మధుసూదనరావు, సునీత పాల్గొన్నారు.

ముగిసిన పైడి మారమ్మ జాతర

పార్వతీపురం రూరల్: మండలంలోని లక్ష్మీనారాయణపురంలో పైడి మారమ్మ, బంగారమ్మ జాతర ఉత్సవాలు బుధవారం అను పోత్సవంతో ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

కోడిశలో కొట్లాట.. నలుగురికి గాయాలు

రేగిడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోడిశలో బుధవారం రాత్రి జరిగిన కొట్లాటలో ఇరువర్గాలకు చెందిన నలుగురు గాయపడ్డారని ఎస్ఐ నీలావతి తెలిపారు. ఎస్ఐ, స్థానికుల కథనం మేరకు..గ్రామంలో పెళ్లి వేడుకలు జరుగుతుండగా ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగి కొట్లాటకు దారితీసింది. ఈ సమయంలో ఒకరిపై ఒకరు రాళ్ల రువ్వుకొన్నారు. దీంతో వైసీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ నెల్లి పెంటన్నాయుడు తలకు తీవ్ర గాయం కాగా, మరో వర్గానికి చెందిన పుట్టా సోమేష్‌తో పాటు మరో ఇద్దరు గాయపడినట్లు సమాచారం. పెంటన్నాయుడును 108లో రాజాం ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకొన్న ఎస్ఐ నీలావతి సిబ్బందితో గ్రామాన్ని చేరుకున్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటన వివరాలు సేకరించి తదుపరి చర్యలు తీసుకొంటామని చెప్పారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ. 2.4 లక్షల విరాళం

విజయనగరం టౌన్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా ద్రాక్షారామానికి చెందిన మాకం కామేశ్వరరావు రూ.2.4 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం విజయనగరం విచ్చేసిన మాకం కామేశ్వరరావు, ఆయన కుమారులు శాసన సభ్యురాలు పూసపాటి అదితి గజపతిరాజును కలిసి ఆమె చేతుల మీదుగా ఆలయ ఈవోకు చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ విజయనగరంలో వెలసిన పైడితల్లి అమ్మవారు మొట్టమొదటిగా బెస్తలకు దొరకడం, ఇప్పుడు అదే బెస్తలు అమ్మవారి ఆలయపునర్నిర్మాణానికి మొదటగా విరాళం అందించడం సంతోషదాయకమని అన్నారు. విరాళం అందించిన మాకం కామేశ్వరరావును, ఆయన కుమారులను ఎమ్మెల్యే అభినందించారు.

పొలం పిలుస్తోందిలో నాయకుల వాగ్వాదం

సాలూరు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బాగువలసలో జరిగిన పొలం పిలుస్తోందిలో టీడీపీ, వైసీపీ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బాగువలసలో బుధవారం సాలూరు ఏవో అనురాధ పండా ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోటోకాల్ విషయమై సాలూరు వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, టీడీపీ మండల నేత మత్స శ్యాంసుం దరరావు మధ్య వాగ్వాదం జరగ్గా ఏవో అనురాధ పండా జోక్యంతో ఇద్దరు శాంతించారు.

బడి తోటలపై దృష్టి సారించాలి: డీఈవో

గరుగుబిల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో బడి తోటల నిర్వహణపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని జిల్లా విద్యా శాఖ అధికారి జి.పగడాలమ్మ సూచించారు. బుధవారం మండలంలోని రావుపల్లి, కొత్తూరు జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాలతో పాటు శివ్వాం ప్రాథమిక పాఠశాలనుపరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో దత్తి అప్పలనాయుడు, ఎంఈవో-2 కె.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విజన్‌పై ప్రత్యేక దృష్టిసారించండి

పార్వతీపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా రానున్న ఐదేళ్లలో జిల్లా విజన్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ప్రతి ఏడాది 15 శాతం ఆర్థిక వృద్ధి ఉండేలా ముందస్తు ప్రణాళికలు ఉండాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర విజన్ 2047, రానున్న ఐదేళ్లలో జిల్లా విజన్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, సీపీవో పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

గరివిడి,(మెరకముడిదాం) అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యంపై వైద్యాధికారులు, పారిశుధ్య అధికారులు అప్రమత్తంగా ఉండాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు.మెరకముడిదాం ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి ఆధ్వర్యంలో బుధవారం మండల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో జ్వరాలు ప్రబలితే వైద్య శిబిరం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరరావు, అజుర్ షాహి జాన్, హరిబాబు పాల్గొన్నారు.

నీటితీరువా బకాయి వసూలు చేయాలి

గజపతినగరం అక్టోబరు 16:(ఆంధ్రజ్యోతి):నీటి తీరువా బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ బి. రత్నకుమార్ కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోల తో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గత ఏడాదిలో ఉన్న బకాయిలపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో డీటీ సీహెచ్ శోభ, ఆర్ఐ అప్పలరాజు పాల్గొన్నారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

సీతంపేట రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):మండలంలోని చినబగ్గ సమీపంలో దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్లు ఎస్ఐ అమ్మన్నరావు చెప్పారు. బుధవారం తమ సిబ్బందితో కలిసి గ్రామ సందర్శనలో భాగంగా తనిఖీలు చేశామని తెలిపారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కోటిపాం విద్యార్థులు

కొమరాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటిపాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉమ్మడి విజయనగరం జిల్లా స్థాయి యోగా పోటీల్లో సత్తాచాటారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురంలో జరిగిన పోటీల్లో ఎ.లేఖన, డి.సాహితి, ఎస్.పరిమళ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లుకోటిపాం జడ్పీ ఉన్నత పాఠశాల యోగ ఉపాధ్యాయులు జి.యశ్వంత్‌కుమార్, పీడీ ఎం.మురళీకృష్ణ తెలిపారు.సత్తాచాటిన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

హాజరు శాతాన్ని పెంచాలి

సీతంపేట రూరల్,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు పాఠశాల సిబ్బందికి సూచించారు.బుధవారం పెద్దపొల్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేపట్టారు.

గౌరీ ఉత్సవాలు ప్రారంభం



శివపార్వతులను ఊరేగిస్తున్న భక్తులు

పాలకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ పరిధిలో దేవాంగులవీధిలో గౌరీ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పలు వీధుల్లో శివుడు, పార్వతిని ఊరే గించి దేవాంగుల వీధికి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు.

నీలకంఠాపురంలో కంటి పరీక్షలు

కురుపాం/కురుపాంరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నీలకంఠాపురంలో శ్రీ వెంటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 112 మందికి పరీక్షచేసి 42 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కంటి వైద్యులు తరుణ్, సురేష్, మాజీ ఎంపీపీ హిమరిక నీలకంఠేశ్వరరావు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగాలకు 54 దరఖాస్తులు

బలిజిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో బోధనేతర సిబ్బంది భర్తీకోసం 54 దరఖాస్తులు అందినట్లు ఎంఈవో-1 సామల సింహాచలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.చౌకీదారు పోస్టుకు 13, అసి స్టెంట్ కుక్ 18, హెడ్‌కుక్ పోస్టుకు 23 మంది దరఖాస్తు చేసినట్లు చెప్పారు. దరఖాస్తులను డీఈవో కార్యాలయానికి అందజేస్తామని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పాలకొండ, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): సింగన్నవలస వద్ద సాయిబాలాజీ పెట్రోల్ ప్లాజాలో అగ్ని ప్రమాదాలు సంభవించే సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు అవగాహన కల్పించారు.కార్య క్రమంలో సూపర్‌వైజర్ కె.రాంబాబు, పంపు ఆపరేటర్లు కిరణ్, కృష్ణ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

పాలకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటదుర్గమ్మ దేవస్థానం పక్కన గురువారం ఉదయం 11 గంటలకు అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్సీ విక్రాంత్, అరకు ఎంపీ తనూజారాణి పాల్గొంటారని తెలిపారు.

నేడు మంత్రి శ్రీనివాస్ పర్యటన

గజపతినగరం, అక్టోబరు 16: (ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం పర్యటించనున్నారని, ఈ సందర్భంగా పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా బీసీ, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారని ఎంపీడీవో బి.కల్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లునాయుడుపేట, పురిటిపెంట, మరుపల్లి, జిన్నాం నుంచి మల్లునాయుడుపేట గ్రామానికి, కొనిస నుంచి గొల్లుపాలెం వరకు, రామన్న పేట, వేమలిల్లో రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు.

30లోగా ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు తీసుకోండి

చీపురుపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలో నమోదై పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఓపెన్ స్కూల్ విద్యార్థులు ఈనెల 30లోగా ధ్రువపత్రాలను తీసుకోవాలని ఓపెన్ స్కూల్ బాలుర ఉన్నత పాఠశాల సమన్వయకర్తలు కె.చంద్రశేఖరరావు, కాపరోతు మురళీధరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పది నుంచి 20 ఏళ్లుగా చాలా మంది విద్యార్థులు తమ ధ్రువపత్రాలను పాఠశాలలో విడిచిపెట్టారని తెలిపారు.

27 నుంచి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు

గజపతినగరం, అక్టోబరు16:(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో నవంబరు 27 నుంచి 30 వరకు ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి ఎన్.నాగభూషణం తెలిపారు.ఈ మేరకు బుధవారం గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎ.సుమన్, ఉపాధ్యక్షుడు బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కురుపాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవ సంస్థ సహకారంతో బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎన్.సత్యనారాయణ, హెచ్‌ఎం టి.శంకరరావు, ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో గ్రామసభ

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):గుమ్మలక్ష్మీపురంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. ఈసందర్భంగా తహసీల్దార్ శేఖర్ మాట్లాడుతూ 20 గ్రామాల్లో జరిగిన రీసర్వేలో తప్పొప్పులు తెలుసుకోవడానికి గ్రామసభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్య క్రమంలో గౌరీశంకరరావు పాల్గొన్నారు.

నవీన్ పట్నాయక్ జన్మదిన వేడుకలు

ఒడిశా

రాయగడ: రాయగడ బీజేడీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిబిరంలో 28 యూనిట్ల రక్తం సేకరించినట్లు ప్రభుత్వ వైద్యుడు గౌతం పట్నాయక్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేష్ పట్నాయక్, సుజాత పాలో, బినాయక్ ఖోరో, కిరణ్‌కుమార్, ఊర్మిళ మండంగి,11 సమితుల నాయకులు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న బీజేడీ నాయకులు